
www.aakshitha.com



People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

బుధవారం । 12 । ఆగస్టు । 2026 । పేజీలు: 08


# సీఎం రేవంత్ సభకు లక్ష మంది సమీకరణ

**సభ ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమీక్ష**



**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:** ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 15న సంగారెడ్డిలో పాల్గొననున్న బహిరంగ సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు సుమారు లక్ష మంది ప్రజలను సమీకరించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ మేరకు సభ ఏర్పాట్లపై నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సచివాలయం లోని తన కార్యాలయంలో ..మిగతా 2లో



# సింగిల్ టీచర్ బడి ఉండొద్దు

**పిల్లల సంఖ్య మేరకు పంతులు ఉండాలి**

**కోమల్లలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు**

**పాఠశాల, పీహెచ్‌సీలో అపరిశుభ్రతపై ఆగ్రహం**

**జనగామ జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి సందీప్ కుమార్ ఝా**



**రఘునాథపల్లి /జనగామ, అక్షిత ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విద్యార్థులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని జనగామ జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం రఘునాథ పల్లి మండలం కోమల్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పలు లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేసి, తక్షణ చర్యలకు ఆదేశించారు. అనంతరం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లతో విద్యా ..మిగతా 2లో

# ఆరుతడి పంటలను సాగు చేయాలి

**పొలాల్లోకి దిగిన పంటను పరిశీలించిన సూర్యాపేట కలెక్టర్**

**'రైతులతో మాట - పంట మార్పిడికి బాటలో రైతులకు దిశానిర్దేశం**



**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి:** వాతావరణం మారుతోంది...నీళ్లు తగ్గుతున్నాయి అందుకే తక్కువ నీటితో ఎక్కువ లాభం వచ్చే ఆరుతడి పంటల వైపు మళ్లాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రైతులకు సూచించారు. మంగళవారం సూర్యాపేట జిల్లాలో నిర్వహిస్తున్న రైతులతో మాట – పంట మార్పిడికి బాట కార్యక్రమంలో భాగంగా ఆయన ఆత్మకూరు(ఎస్), మద్దిరాల, నూతనకల్ మండలాల్లో పర్యటించారు. స్వయంగా ..మిగతా 2లో

# ఈవీఎం గోడౌన్ తనిఖీ

**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల, అక్షిత న్యూస్ :** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లలో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల,ఎన్నికల ఉప తహసిల్దార్ ఉదయ్ కిరణ్, ఆర్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



# సీతాఫలం గుజ్జు విదేశాలకు ఎగుమతి

**సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**వేరుశనగ నూనె ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం కేటాయించాలి**

**నారాయణ పేట,అక్షిత బ్యూరో:** దామరగిద్ద మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ ..మిగతా 2లో

## సీఎం రేవంత్ సభకు లక్ష మంది సమీకరణ

**మొదటి పేజీ తరువాయి...**

ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ వైరల్ జ్వరంతో బాధపడుతున్న కారణంగా సమావేశానికి హాజరు కాలేక పోయారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సభకు తరలివచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, ప్రజల రాకపోకలు, భద్రత, పార్కింగ్, తాగునీరు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు సంగారెడ్డికి చేరుకుని సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోనే ఉంటారని నాయకులు తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు.

**వేదికపై స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది నియోజకవర్గాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక లబ్ధిదారుడిని ఎంపిక చేసి, సభా వేదికపైనే ముఖ్యమంత్రి స్వయంగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు సూచించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు భారీ జన సమీకరణతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## సీతాఫలం గుజ్జు విదేశాలకు ఎగుమతి

**మొదటి పేజీ తరువాయి...**

ప్రియాంక మంగళవారం పరిశీలించారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయం పక్కన ఉన్న భవనంలో 2019 సంవత్సరం నుంచి సీజన్‌వారీగా మహిళా సమాఖ్య సభ్యులు సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్నట్లు డీపీఎం జయన్న కలెక్టర్‌కు వివరించారు. యూనిట్ ద్వారా వచ్చిన లాభాలు, మహిళలకు కల్పించిన ఉపాధి అవకాశాలతో పాటు యూనిట్‌లో తయారు చేసిన సీతాఫలం గుజ్జును విదేశాలకు సైతం ఎగుమతి చేసినట్లు తెలిపారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ప్రస్తుత సీజన్‌లో కూడా సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న భవనంలో సీతాఫలాలను నిల్వ చేసేందుకు,అవసరమైన ఫ్రిజ్‌లను ఏర్పాటు చేసేందుకు స్థలం సరిపోవడం లేదని మహిళా సమాఖ్య సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. యూనిట్ నిర్వహణకు అనువుగా పెద్ద గోదాం నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు.

దీనిపై తహసీల్దార్ తిరుపతయ్య మాట్లాడుతూ మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు కలెక్టర్‌కు తెలిపారు. వీలైనంత త్వరగా ఆ స్థలాన్ని సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌కు కేటాయించాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు.అదేవిధంగా వేరుశనగ నూనె ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కూడా అనువైన స్థలాన్ని కేటాయించాలని సూచించారు. స్థలం కేటాయించే వరకు ప్రస్తుత సీజన్‌లో ఉన్న భవనంలోనే సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను కొనసాగించాలని మహిళా సమాఖ్య సభ్యులకు కలెక్టర్ సూచించారు.

**మహిళా సంఘాల కార్యకలాపాలపై ఆరా**

అనంతరం మండలంలోని స్వయం సహాయక సంఘాల నిర్వహణ, బ్యాంకు రుణాలు,ఎన్‌పీఏ, కిశోర బాలికల సంఘాల ఏర్పాటు, వీఓ భవనాల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

మండలంలో నిర్మాణంలో ఉన్న వీఓ భవనాలను మరో 20 రోజుల్లోపు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే 'మై వన్' సాంకేతికతను వినియోగించి భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# సింగిల్ టీచర్ బడి ఉండొద్దు




**మొదటి పేజీ తరువాయి...**

అంశాలపై సమీక్ష నిర్వహించారు.

**తరగతి గదిలో వంటపై ఆగ్రహం**

కోమల్ల ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల అభ్యసన స్థాయిలు, బోధనా విధానాన్ని పరిశీలించారు. తరగతి గదిలోనే మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న విషయాన్ని గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వంట సమయంలో వెలువడే పొగ, వేడి వల్ల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనాన్ని తప్పనిసరిగా కిచెన్ షెడ్‌లోనే తయారు చేయాలని ఆదేశించారు.

అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ వాటిని 15 రోజుల్లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**పీహెచ్‌సీలో పారిశుద్ధ్య లోపాలపై అసంతృప్తి**

అనంతరం కోమల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రి ప్రాంగణం, వార్డుల్లో పారిశుద్ధ్య లోపాలను గుర్తించారు. పీహెచ్‌సీతో పాటు పాఠశాల పరిసరాలను కూడా నిరంతరం శుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

పీహెచ్‌సీలో నెలకొన్న నీటి సమస్యపై ఆరా తీసిన ఆయన వచ్చే శనివారం నాటికి పూర్తిస్థాయి



నీటి సరఫరా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ల్యాబ్ పరీక్షల నివేదికలను నిర్ణీత సమయంలో రోగులకు అందించాలని సూచించారు. ఫార్మసీలో మందుల పంపిణీలో ముందుగా వచ్చిన మందులను ముందుగా వినియోగించే ఫిఫ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని వైద్యాధికారులకు సూచించారు.

**జిల్లాలో సింగిల్ టీచర్ బడి ఉండకూడదు**

కోమల్ల పర్యటన అనంతరం జిల్లా సమీకృత కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఏ ప్రభుత్వ పాఠశాల కూడా సింగిల్ టీచర్ పాఠశాలగా ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి, అవసరమైన చోటకు వెంటనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల కేటాయింపులో మహిళా ఉపాధ్యాయులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

**'మిషన్ శిఖరం', డిజిటల్ విద్యకు ప్రాధాన్యం**

'మిషన్ శిఖరం' కార్యక్రమం కింద ప్రతి పాఠశాల వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా స్పష్టమైన నివేదికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంతో పాటు విద్యార్థులు అన్‌అకాడమీ తరగతులను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. గణితంలో విద్యార్థుల నైపుణ్యాలను పెంచేందుకు 'ఫాస్ట్ మ్యాథ్స్' పుస్తకాలతో ప్రతిరోజూ సాధన చేయించాలని సూచించారు. క్లస్టర్ రిసోర్స్ టీచర్లు (సీఆర్‌టీలు) కేవలం నివేదికలకే పరిమితం కాకుండా పాఠశాలలను నిరంతరం సందర్శించి ఉపాధ్యాయులకు అకడమిక్ సపోర్ట్ అందించాలని ఆదేశించారు.

మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి.పాఠశాలల్లో భవనాలు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో హెడ్‌మాస్టర్ జాన్, వైద్యాధికారులు, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలను సాగు చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**

వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్లి రైతులతో ముచ్చటించారు.



**జర్బరా సాగు బాగుంది....**

ఆత్మకూరు(ఎస్)మండలంలోని వీరారెడ్డి,సందీప్ రెడ్డి పొలాల్లో సాగవుతున్న పెసర,బంతి తోటలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తుమ్మలపల్లి గ్రామంలో రైతు సౌనయ్య సాగు చేస్తున్న 'జర్బరా' పూల పాలీహౌస్‌ను చూసి ఆయనను అభినందించారు.వరికి బదులు ఇలాంటి కొత్త రకం పంటలు వేయడం వల్ల ఆర్థికంగా మంచి లాభాలు ఉంటాయని చెప్పారు. కంది,బొబ్బర్లు,వేరుశనగ, మొక్కజొన్న, జొన్నలు, సజ్జలు, కూరగాయలు పండిస్తే తక్కువ కాలంలోనే చేతికి డబ్బులు వస్తాయని వివరించారు.

**అంతర పంటలతో అదనపు ఆదాయం**

మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామంలోని రైతు ఎల్లు వెంకటరెడ్డి ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా పెసర వేయడాన్ని కలెక్టర్ పరిశీలించారు.మిగిలిన భూముల్లో మిర్చి సాగు చేసుకోవాలని సూచించారు. నూతనకల్ మండలంలో కొంద్ర వెంకటరెడ్డి, వినోద పొలాల్లో పత్తి, కంది అంతర పంటలను చూసి సలహాలిచ్చారు.ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున, రైతులు వరి సాగును తగ్గించుకోవాలని కోరారు.

**ఆయిల్ పామ్ పెంపకమే లక్ష్యం**

జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ఒక ఉద్యమంలా చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.కొత్తగా ఆయిల్ పామ్ వేసే రైతులకు పూర్తి సమాచారం అందించాలి.

మండలంలో సక్సెస్ అయిన రైతుల విజయ గాథలను ఇతరులకు వివరించాలని సూచించారు. పది రోజుల పాటు నిర్వహించే రైతులతో మాట ప్రోగ్రామ్‌ను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న భూములను గుర్తించి,ఆ రైతులను పంట మార్పిడి వైపు మళ్లించాలని ఆదేశించారు. మండలాల్లో విత్తనాలను ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని,క్షేత్రస్థాయిలో వ్యవసాయ,ఉద్యానవన, విస్తరణ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, ఆత్మకూరు(ఎస్), నూతనకల్,మద్దిరాల మండల ప్రత్యేక అధికారులు డి.విశాల్, భారతి,తహసిల్దార్లు అమిన్ సింగ్,శ్రీనివాస్,తబిత, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

**రహదారుల విస్తరణ, మరమ్మత్తులకు నిధులు**

**ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి**

**కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రి జూపల్లి**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని, సంక్షేమ పథకాల అమలుతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నియోజకవర్గంలోని రహదారుల విస్తరణ, మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఏదుల మండల పరిధిలోని లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 36 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా రహదారుల విస్తరణ, మరమ్మతుల పనులకు నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. గతంలో నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే అభివృద్ధిపై దృష్టి సారించలేదని, నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు.



పిల్లలకు విద్యతో పాటు విలువలు, సంస్కారం నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని మంత్రి సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు వారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని చెప్పారు. పిల్లల స్నేహాలు, వారి నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. కుటుంబంలో మంచి వాతావరణం కల్పించడం ద్వారా పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని మంత్రి కోరారు.

# ఆసిఫాబాద్ కాంగ్రెస్‌లో ఆరోపణలపై కౌన్సిలర్ల ఖండన



**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** గురువారం ఆసిఫాబాద్ డీసీసీ కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు కె. విశ్వప్రసాద్ రావు మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే ప్రచార ఏర్పాట్లు చేసి, కాంగ్రెస్ పార్టీ విజయానికి కీలకంగా కృషి చేశారని కౌన్సిలర్లు స్పష్టం చేశారు. ఇండిపెండెంట్గా గెలిచిన నలుగురు కౌన్సిలర్లను కాంగ్రెస్‌కు మద్దతుగా నిలపడానికి విశ్వప్రసాద్ రావు చేసిన ప్రయత్నం ముఖ్యమని, మైనారిటీ వర్గానికి వ్యతిరేకంగా ఆయనకు ఉద్దేశం లేదని పేర్కొన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గదవేని మల్లేష్ బాధ్యతలు తీసుకున్న వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థి లేకపోవడం పరోక్షంగా బీఆర్ఎస్‌కు మద్దతుగా మారిందని, దీనిపై పార్టీ నాయకత్వం పరిశీలించాలని కోరారు. రూ. 1.50 కోట్లు ఖర్చు చేశారని చేసిన ఆరోపణపై, ఆ డబ్బు ఎవరు ఇచ్చారు? ఎవరు తీసుకున్నారు? అనే వివరాలను ఆధారాలతో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

ముఖ్య నాయకులు ఆత్రం సుగుణ, అజ్మీరా శ్యామ్ నాయక్, కె. విశ్వప్రసాద్ రావు, ఆత్రం సక్కు, గుండా శ్యామ్ కుటుంబ సభ్యుల ఫోన్ కాల్ డేటాను చట్టబద్ధంగా పరిశీలిస్తే వాస్తవాలు బయటపడతాయని కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. ఇకపై నిరాధార ఆరోపణలు మానుకుని, ఆధారాలతో వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని, కాంగ్రెస్ బలోపేతం కోసం ఐక్యంగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో రాపర్తి కార్తీక్, కొండు భారతి, హనుమండ్లు స్వప్న రాణి, కనక కృష్ణమయ్య, కస్తూరి పుష్పలత, లోనారె తారా బాయిలారా తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ బలోపేతం కోసం..

# కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి



**ఇచ్చోడ అక్షిత న్యూస్:** బోథ్ నియోజక వర్గంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ రాథోడ్ బాపురావు అన్నారు. మండల కేంద్రమైన ఇచ్చోడలో మంగళవారం తెలంగాణ రక్షణ సేన (౮=ా ) కార్యాలయంను ఆయన ప్రారంభించారు. పార్టీ కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండాలని ఆయన సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు టిఆర్ ఎస్ లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వా నించారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కొత్తగా చేరిన వారితో పార్టీ మరింత బలోపేతం అవు తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అనుచరులు తదితరులు పాల్గొన్నారు.

## గంగుల బాపురావు నాయకత్వంలో కాంగ్రెస్‌కు కొత్త జోష్...!

**డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి సర్వసమాజ్ ఘన సన్మానం....**



**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన గంగుల బాపురావు యాదవ్ కు తొండాకూర్ గ్రామంలో సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్వసమాజ్ పెద్దమనుషులు, వివిధ కుల సంఘాల నాయకుల సమక్షంలో బాపురావు యాదవ్‌ను శాలువాతో సత్కరించి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గంగుల బాపురావు యాదవ్ నాయకత్వంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బాపురావు యాదవ్‌కు సర్వసమాజ్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గంగుల బాపురావు యాదవ్‌కు లభించిన సన్మానం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుర్మే గంగాధర్, చిన్న ముత్యం, లక్కంపల్లి భోజన్న, కురుమ సంఘం అధ్యక్షుడు రమేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సిరిపురం రాజు, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కుర్మే మల్లేష్, సతీష్ కుమార్, మీ సేవ ఎం. ప్రవీణ్, టి. గణేష్ తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిధ సంఘాల అధ్యక్షులు, సర్వసమాజ్ పెద్దమనుషులు పాల్గొన్నారు.

## నిఖిల్ అంత్యక్రియల్లో పాల్గొన్న అయ్యప్ప శ్రీనివాస్....!



**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని దయానంద్ నగర్ కాలనీకి చెందిన లక్కాకుల పోశెట్టి కుమారుడు లక్కాకుల నిఖిల్ అకాల మరణం చెందారు. నిఖిల్ అంత్యక్రియల్లో ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్మన్, అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిఖిల్ పాడెను మోసి అంత్యక్రియల్లో పాల్గొని, భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిఖిల్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని విషాదమని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని అయ్యప్ప శ్రీనివాస్ వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## శ్రీమన్నారాయణ కాలనీలో గోరింటాకు పండుగ వేడుకలు



**కోదాడ అక్షిత ప్రతినిధి:** కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో మహిళలు ఆషాఢమాస గోరింటాకు పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు గోరింటాకు పెట్టుకుని పాటలు పాడుతూ ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరి కొకరు గోరింటాకు పెట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆషాఢ మాస విశిష్టత, సంప్రదాయాల ప్రాధాన్యతను గుర్తుచేసు కుంటూ వేడుకలు నిర్వహించడంతో కాలనీలో పండుగ వాతా వరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో బండి సావిత్రి, వట్టికూటి నాగమణి, వట్టికూటి నాగలక్ష్మి, బత్తిని హైమావతి, రెడ్డబోయిన లావణ్య, పనస మణి, భావన, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## పడకల్ గ్రామాభివృద్ధి కై నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం ఇచ్చిన గ్రామ సర్పంచ్ దోకురి సునీత ప్రభాకర్ రెడ్డి

### తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు విగ్రహ ఏర్పాటుకై ఎమ్మెల్యేతో భేటీ అయిన పాలకవర్గం గ్రామపెద్దలు



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** రంగా రెడ్డి జిల్లా తలకొండ పల్లి మండలం పడకల్ గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి హైదరాబాద్ లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు పుట్టిన గ్రామం పడకల్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం బూర్గుల రామకృష్ణారావు విగ్రహ ఏర్పాటు మరియు ఆడిటోరియం ఏర్పాటు చేయాలని కోరారు వారు పుట్టిన గ్రామాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి అభివృద్ధి పనులు1 అండర్ డ్రైనేజ్ 2 సిసి రోడ్లు 3 వీధిలైట్లు 4 వెటర్నరీ హాస్పిటల్ 5 గ్రామపంచాయతీ బిల్డింగ్ నిర్మించుటకు నిధులు మంజూరు చేయాలని అలాగే పడకల్ నుండి పెద్దూరు గేట్ వరకు బిటి రోడ్,తలకొండపల్లి నుండి పడకల్ మీదుగా రాయిచేడ్ వరకు బీటి రోడ్ మంజూరు చేయాలని గ్రామాభివృద్ధి నిమిత్తం నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులుఆయిల్ శ్రీనివాస్ గౌడ్,పడకల్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారితో ప్రమాద బీమా చెక్కుని అందజేసిన మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్




**కల్వకుర్తి:అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి నియోజకవర్గం, తలకొండపల్లి మండలం, అంతారం గ్రామానికి చెందిన తిరుమని శ్రీనివాస్ ప్రమాదవశాత్తు గత రెండు నెలల క్రితం మరణించడం జరిగింది మృతుడు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లో ప్రమాద బీమా సంవత్సర ప్రీమియం కట్టినందున శ్రీనివాస్ గౌడ్ ప్రమాదవశాత్తు మరణానికి గాను శ్రీరామ్ నుంచి 35 లక్షల రూపాయల ప్రమాద బీమాను బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కుని శ్రీ రామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారితో కలసి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ అన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా జీవిత బీమా చేసుకోవాలని దానివల్ల అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు బీమా డబ్బులు కుటుంబానికి భరోసా నిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జల సంరక్షణతోనే జలసిరి

### ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** భూగర్భ జల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలని ధర్మాజీ గూడెం సర్పంచ్ జువ్వి నరసింహా అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని చౌటుప్పల్ మండలం, ధర్మోజిగూడెం గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ ప్రారంభించి ఇంకుడు గుంతకు ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షపు నీరు వృధా కాకుండా, భూగర్భంలోకి వెళ్లేందుకు ఇంకుడు గుంతలు దోహదపడ తాయన్నారు. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు వీలుగా, నీటి మట్టాల పెంపుదలకు ఇంకుడు గుంతలు ప్రాముఖ్యత వహిస్తాయన్నారు. భూగర్భంలో నీటిమట్టం పెంపొందించడం ఇంకుడు గుంతలతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రామంలో సాధ్యమైనంత వరకు ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సామిడి సంధ్య, ఐతరాజు శారద, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ, గునుగంటి వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ హరిత



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నట్లు గమనించామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాది వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బోరుబావులు ఉన్న రైతులు సైతం వరి సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉంటుందా అనే విషయాన్ని ఆలోచించుకోవాలని అన్నారు.జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే వర్షపాతం మెరుగ్గా ఉన్నప్పటికీ, వరి సాగుకు సరిపడా నీటి లభ్యత ఉండకపోవచ్చని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు, ఆరుతడి పంటలు సాగు చేసి రైతులు అధిక దిగుబడులతోపాటు లాభాలు పొందాలని కోరారు.

**15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ......**

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు అందజేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండల, గ్రామస్థాయిలో ప్రణాళికాబద్ధంగా కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు వివరించారు.

జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా ఏర్పాటు చేశామని, ఎక్కడైనా అక్రమంగా తరలిస్తే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## సిద్ధాపూర్ చెంతన చెత్త సామ్రాజ్యం వద్దు

### జీవో 641ను వెంటనే రద్దు చేయాలి

### ప్రజల ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

### ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తాం: బీఆర్ఎస్ సీనియర్ నేత వై. రవీందర్ యాదవ్



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాలను కాలుష్య కోరల్లోకి నెట్టే విధంగా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయడం సరికాదని బీఆర్ఎస్ సీనియర్ నేత వై. రవీందర్ యాదవ్ అన్నారు. ప్రజలకు ఉపాధి, అభివృద్ధి అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం.. వారి ఆరోగ్యానికి ముప్పు కలిగించే నిర్ణయాలు తీసుకోవడం దురదృష్టకరమన్నారు. సిద్ధాపూర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో కొత్తూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా, నిరసన కార్యక్రమంలో రవీందర్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. డంపింగ్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నాటి నుంచి సిద్ధాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు, గిరిజన తండాల వాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి వనరుల కల్పన కోసం భూములను కేటాయిస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా డంపింగ్ యార్డు ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. చెత్త డంపింగ్ యార్డు కారణంగా పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని జీవో నంబర్ 641ను రద్దు చేసే వరకు నిరసన కార్యక్రమాలు, ప్రజా ఉద్యమం కొనసాగుతాయని హెచ్చరించారు. డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, జేఏసీ నేతలు చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకోవాలని రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు.

## లయన్స్ క్లబ్‌చే గర్భిణీ స్త్రీలకు అవగాహన సదస్సు




**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మున్సిపాలిటీలోని తంగడపల్లి రోడ్డులోని కళాశ్రీ ఫంక్షన్ హాల్ లో మంగళవారం రోజున లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి లైన్స్ క్లబ్ చౌటుప్పల సేవా అధ్యక్షులు ఎండి అత్ హర్ పాషా అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లైన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా, లైన్స్ క్లబ్ నల్లగొండ జిల్లా రీజియన్ చైర్ పర్సన్ సంజీవరెడ్డి, జోన్ చైర్మన్ ఉప్పు ఆంజనేయులు, డాక్టర్ వై సూర్యశ్రీ, డాక్టర్ ప్రశాంతి రెడ్డి, డాక్టర్ అవ్వరు శ్రీనివాస్ ప్రసాద్ లు పాల్గొని మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలు తమ ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్యుల సూచనలు మేరకు పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు . ఆహారంలో ఐరన్, పోలిక్ యాసిడ్, కాల్షియం వంటి మందులను వైద్యుల సూచనల ప్రకారం వాడాలని కోరారు. గర్భిణీ స్త్రీలు త్రాగునీరు, పోషకాహారం, తగిన విశ్రాంతి, పరిశుభ్రమైన వాతావరణం ఎంతో అవసరమని తెలియజేశారు. అధిక రక్తపోటు, రక్తస్రావం, తీవ్రమైన తలనొప్పి, కాళ్లు, అధికంగా వాపు,చూపు మస్కబారడం లేదా బిడ్డ కదలికలు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ప్రతి గర్భిణికి సురక్షితమైన గర్భాదరణ ఆరోగ్యకరమైన ప్రసవం మరియు తల్లి బిడ్డ ఆరోగ్యం కోసం కుటుంబ సభ్యులు సహకరించాలని తెలిపారు.గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పై అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్బు కార్యదర్శి దాచేపల్లి రాజు గుప్తా, కోశాధికారి బత్తిని రఘు, నాంపల్లి రమేష్ గుప్తా, తిరందాసు జగన్ నాథ్, కాసుల వెంకటేశం గౌడ్, కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, గొప్ప గోని లక్ష్మణ్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, సిలివేరు మంగయ్య, వనం రాజు, సంపూర్ణ చారి, పోలోజు రాజు, పోలోజు శ్రీనివాస చారి, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గారెడ్డి ఫ్రస్ట్రేషన్ ఏ స్థాయిలో ఉందో ప్రజలకు అర్థమైంది

### అబద్ధాల్లో ఆస్కార్ ఇచ్చినా తక్కువే..

### ప్రజల సమస్యలు పట్టించుకోకుండా తన పదవి కోసమే పోరాటం

### బీఆర్ఎస్, హరీశ్‌రావుపై అనవసర వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు

### సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి అక్షిత బ్యూరో :** సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కాంగ్రెస్ నాయకుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగ్గారెడ్డి తీవ్ర నిరాశ, నైరాశ్యంలో ఉన్నారని, ఆయన వ్యవహారశైలి, వ్యాఖ్యలతో సంగారెడ్డి ప్రజలకు ఆయన పరిస్థితి ఏమిటో స్పష్టంగా అర్థమైందని అన్నారు. తన గొప్పను తానే చెప్పుకోవడం, పదేళ్ల క్రితం జరిగిన రాహుల్‌గాంధీ సభను పదేపదే ప్రస్తావించడం మినహా జగ్గారెడ్డికి చెప్పుకోవడానికి ఏమీ లేదని విమర్శించారు. పార్టీ తనను అనుమానిస్తున్న సమయంలో అధిష్ఠానం మెప్పు కోసం రాహుల్‌గాంధీ సభను నిర్వహించానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అబద్ధాలు చెప్పడంలో జగ్గారెడ్డికి ఏ అవార్డు ఇచ్చినా తక్కువేనని, ఆస్కార్ అవార్డు ఇచ్చినా సరిపోదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సంగారెడ్డి ప్రజలు పలుమార్లు అవకాశమిచ్చినా ప్రజలకు సేవ చేయకుండా తన రాజకీయ భవిష్యత్తు, పదవుల కోసమే జగ్గారెడ్డి వ్యవహరించారని చింతా ప్రభాకర్ ఆరోపించారు. గత ఎన్నికల్లో ప్రజల సానుభూతి పొందేందుకు భయాందోళనలను సృష్టిస్తూ ఓట్లను అభ్యర్థించారని, గెలిచిన అనంతరం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారని విమర్శించారు. తాము అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యనే ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నామని, అదే ప్రజలు గుర్తించి తమకు మద్దతు ఇచ్చారని తెలిపారు. ప్రజలు తిరస్కరించిన తర్వాత జగ్గారెడ్డి పరిస్థితి దిక్కుతోచని స్థితికి చేరిందని ఎద్దేవా చేశారు. జగ్గారెడ్డి కుటుంబానికి పదవులు దక్కాలని, తన రాజకీయ ఉనికిని కాపాడుకోవాలని చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. తన రాజకీయ జీవితమంతా భూముల వ్యవహారాల చుట్టూనే తిరిగిందని ఆరోపించారు. రైతులు, సామాన్య ప్రజల సమస్యలపై నిజమైన పోరాటం చేసిన చరిత్ర ఆయనకు లేదని విమర్శించారు. గతంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న కాలంలో అవినీతి ఆరోపణలు, అధికారులపై వచ్చిన పరిణామాలను ప్రజలు మరచిపోలేదని అన్నారు. అప్పటి ఘటనల్లో పలువురు అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కొందరు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గురివింద గింజ తన నలుపు ఎరుగదు అన్న సామెతను ప్రస్తావిస్తూ.. ఇతరులకు నీతులు చెప్పే ముందు తన గతాన్ని జగ్గారెడ్డి గుర్తు చేసుకోవాలని చింతా ప్రభాకర్ సూచించారు. తనపై కేసులు, జైలు వ్యవహారాలను పదేపదే ప్రస్తావిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూడటం సరికాదన్నారు. తనపై కేసులు పెట్టింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని, చట్టం ఎవరికీ చుట్టం కాదని వ్యాఖ్యానించారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ వంటి జాతీయ నాయకులను సంగారెడ్డికి తీసుకొచ్చినా ప్రజలు జగ్గారెడ్డిని తిరస్కరించారని చింతా ప్రభాకర్ అన్నారు. పెద్ద నాయకులను తీసుకురావడం వల్ల మాత్రమే ప్రజల విశ్వాసం లభించదని, ప్రజల మధ్య ఉండి పనిచేస్తేనే ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో జగ్గారెడ్డి రాజకీయ వైఖరికి ప్రజలు ఇప్పటికే సమాధానం చెప్పారని అన్నారు. డాన్స్ చేయాలనుకుంటే చేసుకో.. నీ ఆవేదనను ఎలా వ్యక్తం చేసుకోవాలనుకుంటే అలా చేసుకో.. కానీ బీఆర్ఎస్, హరీశ్‌రావు పేర్లు ప్రస్తావిస్తూ అనవసర వ్యాఖ్యలు చేయొద్దు అని చింతా ప్రభాకర్ హెచ్చరించారు. కార్పొరేషన్ చైర్మన్ పదవి కోసం ఎవరిని బ్లాక్‌మెయిల్ చేయాలనుకుంటే వారిని చేసుకోవచ్చని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇకపై బీఆర్ఎస్, హరీశ్‌రావు తదితరులపై అనవసర వ్యాఖ్యలు చేయకుండా సంయమనం పాటించాలని మీడియా ద్వారా జగ్గారెడ్డిని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సంగారెడ్డి అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ స్పష్టం చేశారు.

# పశుపోషణతో రైతులకు అదనపు ఆదాయం

### మరికల్‌లో రైతు పొలాన్ని పరిశీలించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





**నాగర్కర్నూల్ అక్షిత ప్రతినిధి:** పశువుల సంఖ్య, పాల ఉత్పత్తి, పశుపోషణ ద్వారా వస్తున్న ఆదాయంపై కలెక్టర్ ఆరా, వ్యవసాయంతో పాటు పశుపోషణను అనుబంధ రంగంగా అభివృద్ధి చేసుకోవడం ద్వారా రైతులు తమ ఆదాయాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. రైతులు పశుసంపదను సమర్థవంతంగా నిర్వహించుకుంటూ పాల ఉత్పత్తిని పెంచుకోవడంతో పాటు పశుపోషణ ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకునేలా అవసరమైన సహకారం అందించాలని అధికారులకు సూచించారు.

మంగళవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తిమ్మాజీపేట మండలంలోని మరికల్ గ్రామంలో రైతు పెర్కంపల్లి లింగం పొలాన్ని సందర్శించారు. రైతు వ్యవసాయంతో పాటు చేపడుతున్న పశువుల పెంపకాన్ని స్వయంగా పరిశీలించిన కలెక్టర్, పశువుల సంరక్షణ, పాల ఉత్పత్తి, పశుపోషణ ద్వారా రైతుకు లభిస్తున్న ఆదాయం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ రైతు పెర్కంపల్లి లింగంతో నేరుగా మాట్లాడారు.

రైతు వద్ద ప్రస్తుతం ఎన్ని పశువులు ఉన్నాయి, వాటిలో పాలిచ్చే పశువుల సంఖ్య ఎంత, రోజువారీగా ఎంత మేర పాల ఉత్పత్తి అవుతోంది, ఉత్పత్తి అవుతున్న పాలను ఎక్కడ విక్రయిస్తున్నారు, పాల విక్రయం ద్వారా నెలవారీగా ఎంత ఆదాయం వస్తోంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అదేవిధంగా పశువుల పెంపకానికి రైతు చేస్తున్న ఖర్చు, పశువులకు అందిస్తున్న దాణా, పచ్చిమేత, పొడి మేత లభ్యత, పశువుల ఆరోగ్య పరిస్థితి, పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయిస్తున్నారా లేదా అనే అంశాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పశువులకు ఏవైనా అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు వెంటనే వైద్య సేవలు అందుతున్నాయా, గ్రామస్థాయిలో పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా అనే విషయాలపై కూడా ఆరా తీశారు.

వ్యవసాయంపై మాత్రమే ఆధారపడకుండా పశు పోషణ, పాల ఉత్పత్తి వంటి అనుబంధ రంగాలను కూడా రైతులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పంటల సాగుతో పాటు పశువుల పెంపకం కొనసాగించడం ద్వారా రైతు కుటుంబానికి నిరంతర ఆదాయ వనరు ఏర్పడుతుందని తెలిపారు.

ముఖ్యంగా పాడి పశువుల పెంపకంలో పశువుల ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, సమయానుకూలంగా వైద్య సేవలు అందించడం కీలకమని కలెక్టర్ తెలిపారు. పశువులకు నాణ్యమైన మేత అందించడం ద్వారా పాల ఉత్పత్తిని పెంచుకోవచ్చని, తద్వారా రైతులకు వచ్చే ఆదాయం కూడా పెరుగుతుందని వివరించారు.

ప్రభుత్వం రైతుల సంక్షేమం, పశుసంపద అభివృద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పశుపోషణపై ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి వారికి అవసరమైన మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట డిఆర్ఓ పాండు, మండల తాహసిల్దార్, మరికల్ సర్పంచ్ రమాదేవి వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రావాల్సిందిగా కోరుతూ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంగళ వారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు పస్తం గంగ రాములు, దేవాలయ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, నూతనంగా ఎన్నికైన ధర్మకర్తలు వరకాలరవి గౌడ్, ఆవుల యేసు యాదవ్, దాడి యశ్వంత్ రెడ్డి, గగులోతు అరుణ నాయక్, బొబ్బిళ్ళ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

## మర్ల మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

### ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై నాయకులతో చర్చ



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, ఆగస్టు 11:** చిల్కానగర్‌లోని మర్ల మైసమ్మ దేవాలయాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గుడి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో బండల నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయాన్ని సందర్శించి మర్ల మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లె నర్సింగరావు, అంబాటి జగదీష్ ముదిరాజ్, జల్లి మోహన్, నేర్ధం భాస్కర్ గౌడ్, ముక్కాల రామకృష్ణ ముదిరాజ్, ఈరెల్లి రవీందర్ రెడ్డి, చేర్యాల శ్రీనివాస్, మాస శేఖర్, పల్లె రాజ్ కుమార్ గౌడ్, ఆకిటి బాల్‌రెడ్డి, శనిగరం తిరుమలేష్, ముక్కాల హరికృష్ణ ముదిరాజ్, ఫోటోల రాజు, గడ్డం పాపిరెడ్డి, సంతోష్ రెడ్డి, రామకృష్ణ, సుభద్ర, లక్ష్మి, అండాలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** హన్వాడ మండల కేంద్రంలోని 2బీహెచ్‌కే ఇళ్లకు ఆనుకుని ఉన్న ప్రాంతంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కేటాయించేందుకు ప్రతిపాదించిన స్థలాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా హన్వాడ తహసీల్దార్, మండల సర్వేయర్‌తో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, భూమికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఏర్పాటుకు స్థలం అనువుగా ఉందా, భూమి విస్తీర్ణం, సరిహద్దులు తదితర అంశాలపై వివరాలను సేకరించారు.

ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి, పాఠశాల ఏర్పాటుకు అనువైన స్థలంగా ఉందా అనే అంశంపై అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## పంతంగి జడ్పీహెచ్ఎస్ ను సందర్శించిన సీఈవో శోభారాణి



చౌటుప్పల్/ అక్షిత న్యూస్: యాదాద్రి జిల్లా,చౌటుప్పల్ మండలం, పంతంగి గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ ను మంగళవారం జిల్లా పరిషత్ సీఈవో శోభారాణి సందర్శించారు. ఎంపీడీవో శ్రీలత, పంతంగి గ్రామ సర్పంచ్ తో కలిసి విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ ను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులతో కలిసి వారు మొక్కలు నాటారు. విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని తెలిపారు. అనంతరం గ్రామంలో పూర్తయిన ఇంది రమ్మ ఇండ్లను, ఎంపీడీవో శ్రీలత, గ్రామ సర్పంచ్ తో కలిసి పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల గురించి సంబంధిత ఏఈ ని అడిగి తెలుసుకొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్, పంచాయతీ కార్యదర్శి పద్మజ,హౌసింగ్ ఏఈ పవన్ కళ్యాణ్, పాఠశాల ప్రధా నోపాధ్యాయులు సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణవేణి పాఠశాల విద్యార్థుల క్షేత్ర స్థాయి పర్యటన



షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: షాద్ నగర్ కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా ఆధ్వర్యంలో 8, 9వ తరగతి విద్యార్థులను వ్యవసాయ క్షేత్ర పర్యటనకు శ్రీరంగాపూర్ గ్రామ రైతు, గ్రామ సర్పంచ్ రమేశ్ మరియు డిప్యూటీ సర్పంచ్ శ్రీ సయ్యద్ ముస్తఫా ఆధ్వర్యంలో పొలానికి తీసుకొని వెళ్లారు. అక్కడ విద్యార్థులు పంట నాట్ల నుండి దిగుబడి వరకు ఉండే విధానం, రైతు శ్రమ, వారు పడే కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్ వ్యవసాయానికి కావలసిన నేల, పనిముట్లు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల గురించి విద్యార్థులకు అనేక విషయాలను వివరించారు.

ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా మాట్లాడుతూ, వ్యవసాయమే ప్రధానంగా, వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న దేశం మన భారతదేశం అని అన్నారు. మన దేశం సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. తరగతి గదిలోనే విషయాలను బోధించడం కంటే ఇలా ప్రాక్టికల్‌గా విద్యార్థులకు వివరించడం ద్వారా వారు విషయాలను త్వరగా అర్థం చేసుకుంటారని అన్నారు.

డిప్యూటీ సర్పంచ్ సయ్యద్ ముస్తఫా మాట్లాడుతూ, భారతదేశానికి వెన్నెముక అయిన రైతులు, వ్యవసాయ కూలీలు మరియు వ్యవసాయం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. రైతులు ఎదుర్కొనే కష్టనష్టాలను, వారి శ్రమ విలువను విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఎస్పీ మహేష్ బి గితెతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్**



రాజన్న సిరిసిల్ల, అక్షిత: జిల్లాలో ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ మహేష్ బి గితె తో కలిసి సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులతో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, తప్పనిసరిగా హాజరయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లు, వేదిక, గ్రౌండ్ తదితర ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అవగాహన కలిగే విధంగా స్టాళ్లలో ప్రదర్శించాలని సూచించారు. దేశభక్తిని ప్రతిబింబించేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసేందుకు సంబంధించిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథి ప్రసంగం కోసం జిల్లాలోని వివిధ శాఖలు చేపట్టిన ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సంక్షిప్త నివేదికలను జిల్లా పౌర సంబంధాల అధికారికి అందజేయాలని ఆదేశించారు.జిల్లాకు చెందిన ప్రముఖులు, వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వ్యక్తులు వేడుకలకు హాజరయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ప్రతి ప్రభుత్వ శాఖ తమ కార్యాలయాల్లో కూడా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించడంతో పాటు జిల్లా స్థాయి వేడుకలకు అధికారులు, సిబ్బంది హాజరయ్యేలా చూడాలని తెలిపారు. వేడుకల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, విద్యార్థులకు అవసరమైన మేర తాగునీటి వసతి ఏర్పాట్లు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు మెరుగైన పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించాలి

**అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**

**చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను పరిశీలించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

నాగర్కర్నూల్ ,అక్షిత ప్రతినిధి: అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తిమ్మాజీపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు.

ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో నమోదైన చిన్నారుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పిల్లల వయస్సుకు అనుగుణంగా వారి ఎత్తు, బరువు ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. ఇందుకోసం కేంద్రంలో అందుబాటులో ఉన్న ఎత్తు, బరువు కొలిచే పరికరాలను పరిశీలించారు. చిన్నారుల శారీరక ఎదుగుదలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని, వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లలను గుర్తించి వారికి అవసరమైన అదనపు పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు.



అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు అందిస్తున్న బాలామృతం పంపిణీపై కూడా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలామృతం సకాలంలో సరఫరా అవుతున్నదా, అర్హులైన పిల్లలందరికీ నిర్ణీత పరిమాణంలో పంపిణీ చేస్తున్నారా, పంపిణీ వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నారా అనే అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అర్హులైన ప్రతి చిన్నారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేరేలా చూడాలని ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రం ద్వారా గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారంపై కూడా కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించడంతో పాటు, వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న సేవల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక విద్య, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్రానికి వచ్చే ప్రతి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ, పోషకాహార లోపం ఉన్న పిల్లలను ముందుగానే గుర్తించి సంబంధిత వైద్య, ఆరోగ్య శాఖల సహకారంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, పోషకాహార కార్యక్రమాల ప్రధాన లక్ష్యం తల్లులు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమేనని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కలెక్టర్ సందర్శన సందర్భంగా అంగన్వాడీ కేంద్రం సిబ్బంది చిన్నారులకు అందిస్తున్న సేవలు, పౌష్టికాహార పంపిణీ, పిల్లల హాజరు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు, జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ శాఖ అధికారి డీఆర్ఓ పాండు వివరించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రతను పాటిస్తూ చిన్నారులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి అంగన్వాడీ కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు.

జిల్లా కలెక్టర్ వెంట డిఆర్ఓ ఇంచార్జ్ సంక్షేమ శాఖ అధికారి పాండు, మండల స్థాయి గ్రామ సర్పంచ్ కవిత తదితరులు ఉన్నారు

# అవంచ పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**గర్భిణీల నెలవారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా**

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ నియోజకవర్గం, తిమ్మాజీపేట మండలంలోని అవంచ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మందుల లభ్యత తదితర అంశాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రానికి ఏఎంసి వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణీలతో కలెక్టర్ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను, గర్భిణీలకు నిర్వహిస్తున్న నెలవారీ ఏఎంసీ పరీక్షల వివరాలు, ఇప్పటివరకు నిర్వహించిన వైద్య పరీక్షలు, ఆరోగ్య నివేదికలు, వారికి అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య పరీక్షలు, మందులు, సూచనలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.



అలాగే చికిత్స కోసం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన బాలికతో కలెక్టర్ మాట్లాడి ఆమెకు ఉన్న ఆరోగ్య సమస్యల వివరాలను బాలిక తల్లి తో అడిగి తెలుసుకున్నారు. ఆమెకు అందిస్తున్న చికిత్స, వైద్యుల సూచనలు, అవసరమైన మందుల వివరాలపై సంబంధిత వైద్యులను ప్రశ్నించారు. రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, వైద్య సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజలు వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగి పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని అవసరమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

అనంతరం ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందులు, వినియోగిస్తున్న మందులు, అత్యవసర మందుల నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత ఏర్పడకుండా ముందస్తుగా అవసరాలను గుర్తించి సంబంధిత అధికారులకు నివేదించి అవసరమైన మందులను తెప్పించుకోవాలనిసూచించారు.

అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలో రోజువారీగా నిర్వహిస్తున్న ఓపీ వివరాలు, వైద్య సేవలు పొందుతున్న రోగుల సంఖ్య, అందిస్తున్న చికిత్స తదితర వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని, ప్రతిరోజూ అందుతున్న వైద్య సేవలకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు కీలకమైన వైద్య సేవల కేంద్రాలని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి ఒక్కరికీ అవసరమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ వెంట వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పేద కుటుంబాలకు అండగా.. నిగ్వా సర్పంచ్ మేంచు రమేష్

**చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం**

**కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులకూ సహకారం**

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం**



**నిర్మల్ అక్షిత బ్యూరో, ఆగస్టు 11:** కుబీర్ మండలం నిగ్వా గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా గ్రామ సర్పంచ్ మేంచు రమేష్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా చేయూత పెన్షన్ పథకం కింద అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రారంభించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు అందిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల దరఖాస్తుల ప్రక్రియలోనూ సర్పంచ్ స్వయంగా సహకరిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేంచు రమేష్ మాట్లాడుతూ.. గ్రామంలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులు, చేనేత కార్మికులు, వికలాంగులు తదితర అర్హుల నుంచి పెన్షన్ల కోసం దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందించాలన్నదే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహ సమయంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల దరఖాస్తులకు కూడా గ్రామపంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడకుండా దరఖాస్తుల ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన పత్రాల విషయంలో సూచనలు చేస్తున్నామని చెప్పారు. చేయూత పెన్షన్ పథకానికి సంబంధించి అర్హులైన వారికి ప్రభుత్వం త్వరితగతిన మార్గదర్శకాలు విడుదల చేసి పెన్షన్ సౌకర్యం కల్పించాలని సర్పంచ్ కోరారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు సంక్షేమ పథకాలే చేరువ చేయడమే లక్ష్యంగా సర్పంచ్ మేంచు రమేష్ తీసుకుంటున్న చొరవ గ్రామంలో ప్రశంసలు అందుకుంటోంది. అర్హులైన వారు అవసరమైన పత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరీష్, ఉప సర్పంచ్ దిగంబర్ పటేల్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తి చాటుతూ సంగారెడ్డిలో ఘనంగా తిరంగా యాత్ర



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** భారతీయ జనతా పార్టీ కేంద్ర, రాష్ట్ర పార్టీ నాయకత్వాల సూచన మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో మంగళవారం ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూనిన పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ఐబీ నుంచి జిల్లా కోర్టు వరకు భారీ పాదయాత్ర చేపట్టారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ సాగిన ఈ యాత్రలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ భావాన్ని చాటాలని ఆయన కోరారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు తమ ప్రాణాలను, జీవితాలను త్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డిలో భారీ జాతీయ జెండాతో నిర్వహించిన ఈ యాత్ర ప్రజల్లో దేశభక్తి, జాతీయతా భావాన్ని మరింత పెంపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, విజయపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రాజేశ్వరరావు దేశ్‌పాండే, వెంకట నరసింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మాణిక్‌రావు, గొల్ల భాస్కర్, జోష్ణ, అశోక్, కసిని వాసు, దోమల విజయ్‌కుమార్, మందుల నాగరాజు, శ్రీకాంత్, ప్రవీణ్‌యాదవ్, నరేన్‌దేశ్‌పాండే, జగన్నాథ్, మీనా గౌడ్, తేజస్విని, తులసి, ప్రకాశ్‌రెడ్డి, ద్వారకా రవి, ద్వారకా శివ, సాయిబాబా, నాగరాజు, పవన్, రవిశంకర్, జగన్, క్రాంతి కులకర్ణి, నరేష్‌గౌడ్, సందీప్, రాము, సాయి, అభినవ్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## గుడి కట్ట వెడల్పు పనులకు భూమిపూజ



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామంలో శ్రీ కాళికాదేవి ఆలయం ఊర చెరువు కట్ట వెడల్పు పనులకు మంగళవారం గ్రామ సర్పంచ్ రామచంద్రయ్య యాదవ్ భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కొబ్బరికాయ కొట్టి జేసీబీతో పనులను ప్రారంభించారు.

దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు పనులు ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట మండల మాజీ వైస్ ఎంపీపీ వాకిటి బాలరాజు, మాజీ సింగల్ విండో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి .గుంత రమణ, మాజీ సర్పంచ్ రాణి పరమేష్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నరుకుల యాదగిరి, వార్డ్ మెంబర్లు వాకిటి కానపురం కొండన్న, నర్కుల కురుమూర్తి, బర్మల రాజు, గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మంద కన్నయ్య, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ్రాతి సాయిల్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కుడికిల్ల నాగేశ్వర్ రెడ్డి, మంద వెంకటన్న, గుండ్రాతి కృష్ణయ్య గౌడ్, మధ్యల వెంకటన్న, మాజీ వార్డ్ సభ్యులు గణం పరశురాములు, ఆకుల శ్రీనివాసులు, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షుడు బర్మల రవి, డాక్టర్ సుధాకర్, గొల్ల మల్లేష్, గొల్ల ముంత పర్వతాలు, బిఆర్ఎస్ నాయకులు పల్లె ప్రభాకర్ రెడ్డి, అమరచింత శ్రీనివాస్ రెడ్డి, మంద సురేందర్, దూత మన్నెంకొండ, మంద జములన్న, గ్రామ పెద్దలు. యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** ప్రైవేటు అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు (ల్యాబ్స్), లైబ్రరీ, విద్యార్థుల వసతులను ఆయన నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న బోధన, మౌలిక సదుపాయాల గురించి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు భవనంలో అరకొర వసతుల వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు.

అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అద్దె భవనంలో విద్యార్థులకు ఎలాంటి తాగునీరు, పారిశుధ్యం లేదా ఇతర మౌలిక సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కళాశాల సొంత భవన నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పిల్లలకు దుస్తుల పంపిణి



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపల్ కేంద్రంలోని మూడవ వార్డులోని అంగన్వాడి సెంటర్లో అంగన్వాడి చిన్నారులకు కొత్త ఏకరూప దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అ వార్డు కౌన్సిలర్ మురళి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పెంటన్న యాదవ్ పాల్గొని చిన్నారులకు దుస్తులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సావిత్రీ, రెండో వార్డు కౌన్సిలర్ ఎండి అబ్దుల్ నబీ, సంజీవులు, సలీం ఖాన్, కోఆప్షన్ నెంబర్స్ ఆఫీస్ ఖాన్ , కొండారెడ్డి, మాజీకో ఆప్షన్ నెంబర్ మిషేక్, ముజీబ్, బాలకృష్ణ, బాలరాజు, అనిల్, హరీష్, నాగరాజు, కొత్తకోట మున్సిపల్ కౌన్సిలర్స్, కో ఆప్షన్ నెంబర్స్, మాజీ కోఆఫన్ నెంబర్స్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, బి ఎల్ ఏ ఏజెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలి

### మండల విద్యాధికారి బషీర్ అహ్మద్



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** విద్యార్థులందరినీ ఆన్లైన్లో నమోదు చేయాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ సూచించారు మంగళవారం లింగాల మండల పరిధిలోని ఎంపీ యుపిఎస్ వల్లభాపూర్,మానాజీపేట ,రాంపూర్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది.ఇందులో భాగంగా పాఠశాలలో విద్యార్థులందరూ ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించడం జరిగింది .మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు, ఎఫ్ ఏ -వన్ అభ్యసన సామర్థ్యాలను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించడం జరిగింది. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించడం జరిగింది, పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఆర్పి హరిలాల్, ఆయా పాఠశాలలా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# పాఠశాలల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మహబూబ్‌నగర్, అక్షిత న్యూస్:** పాఠశాలల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నవాబ్‌పేట మండలంలోని కారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్), నవాబ్‌పేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు.ముందుగా కారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్.పి.హెచ్.ఎస్)ను



సందర్శించిన ఆయన పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ, పరిసరాల్లో పిచ్చి మొక్కలు, పొదల తొలగింపు పనులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం అందేలా పారిశుధ్య పనులను నిరంతరం చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా, మౌలిక వసతులకు సంబంధించిన అంశాలను కూడా పరిశీలించారు. అనంతరం నవాబ్‌పేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కె .జి.బి.వి) ను సందర్శించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి యోగక్షేమాలు, విద్యాభ్యాసం, విద్యాలయంలో అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కొంత సమయం గడిపిన ఆయన, వారి సమస్యలు, అవసరాలను తెలుసుకుని, ప్రభుత్వం అందిస్తున్న విద్య, వసతి, భోజనం తదితర సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన అదనపు కలెక్టర్, భోజనం నాణ్యత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.కారుకొండ పర్యటనలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ), పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు. కేజీబీవీ తనిఖీ సందర్భంగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సిఈఓ) వెంకట్ రెడ్డి, ఎంపిడిఓ, ఎంపిఓ, స్పెషల్ ఆఫీసర్ (ఎస్ఓ) తదితర అధికారులు పాల్గొన్నారు.

## పాలకులు నిర్లక్ష్యం వీడి నిధులు విడుదల చేయాలి

### ఈనెల 29,30,31భువనగిరి నుండి హైదరాబాద్ పాదయాత్ర

### 31న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద సీపీఎం మహాధర్నా

### సీపీఎం జిల్లా కార్యదర్శి యండి జహంగీర్



**యాదాద్రి భువనగిరి/ అక్షిత బ్యూరో:** యాదాద్రి భువనగిరి జిల్లా సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో గత, ప్రస్తుత పాలకులు పూర్తిగా విఫలమయ్యారని వాటి పరిష్కారం కోసం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి యండి జహంగీర్ తెలిపారు.మంగళవారం స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కీలక ప్రాజెక్టులుగా ఉన్న బస్వాపురం ప్రాజెక్టు, గంధమల్ల ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు, నవాబ్ పేట రిజర్వాయర్ ప్రాజెక్టు, చిన్న నీటి పారుదల కాలువలైన ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బునాదిగాని, ఆసిఫ్ నహర్ కాలువ పునరుద్ధరణ పనులు పూర్తి చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29, 30, 31తేదీలలో సీపీఎం చలో హైదరాబాద్ పేరిట రైతులు, నిర్వాసితులు,ప్రజలతో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 29న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై 31న హైదరాబాద్ ఇందిరా ధర్నా చౌక్ కు చేరుకుంటుందన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే " మహా ధర్నా " లో రైతులు, వ్యవసాయ కార్మికులు, నిర్వాసితులు, వృత్తి దారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ నెల 16న సాగు తాగునీటి సమస్య పరిష్కారం కోసం వివిధ రాజకీయ పక్షాలతో, ప్రజాసంఘాలతో, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం భువనగిరిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 31న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నాకు పెద్ద ఎత్తున అన్ని వర్గాలు తరలిరావాలని యండి జహంగీర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్ పాల్గొన్నారు.

## సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ వద్దు

### జీవో 641ను వెంటనే రద్దు చేయాలి

### డంపింగ్ యార్డ్‌తో ప్రజారోగ్యం, పర్యావరణానికి తీవ్ర ముప్పు

### జీవో రద్దు చేసే వరకు ప్రజా ఉద్యమం కొనసాగుతుంది: మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** కొత్తూర్ మండలం సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో నంబర్ 641ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల భవిష్యత్తులో ప్రజలకు, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ జేఏసీ ఆధ్వర్యంలో కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే చెత్త నుంచి వెలువడే దుర్వాసన, దుమ్ము, పొగతో పాటు హానికర వాయువుల కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. చెత్తలోని వ్యర్థాలు భూమిలోకి, భూగర్భ జలాల్లోకి చేరితే నీటి కాలుష్యం ఏర్పడి తాగునీరు, వ్యవసాయ భూములు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల ఈగలు, దోమలు, క్రిమి కీటకాలు వంటి వ్యాధి కారకాలు పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించకపోతే భూసారం దెబ్బతినడం, పంటలపై ప్రతికూల ప్రభావం పడటం, పరిసరాల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతాయని అన్నారు. గ్రామాల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో ఆ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం సరికాదని అంజయ్య యాదవ్ అన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం కంటే ఏ అభివృద్ధి కార్యక్రమం ముఖ్యమైనది కాదని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో పౌర హక్కుల సంఘాల నాయకులు, జేఏసీ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు, సిద్ధాపూర్ పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్ జీవోను రద్దు చేయాలని నినాదాలు చేస్తూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. జీవో నంబర్ 641ను రద్దు చేసే వరకు ప్రజా ఉద్యమం కొనసాగుతుందని, అవసరమైతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు..